ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
మంగళవారం 14 అక్టోబరు 2025



విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు

● ఎస్పీ మహేష్ బి. గితే

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన ధైర్యవంతులైన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేష్ బి. గీతే సోమవారం తెలిపారు. ఈ పోటీలు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో 6వ తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో పోలీస్‌పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ దూరంగా ఉండాలనే అంశంపై ఈ వ్యాస రచన పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులు తమ వ్యాసాలను అక్టోబరు 28వ తేదీ లోగా సమర్పించాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. అంతే కాకుండా జిల్లా స్థాయిలో 1వ, 2వ, 3వ స్థానాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వ్యాసాన్ని 500 పదాలు మించకుండా పేపర్‌పై రాసి పేరు, విద్యార్హతలు నమోదు చేసి ఫొటో తీసి పీడీఎఫ్‌లో ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసేకోవాలన్నారు.

రహదారులపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రహదారుల వెంట ధాన్యం ఆరబెట్టి ప్రమాదాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాహుల్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ధాన్యం రోడ్లపై పోయకూడదని, ప్రమాదాలకు కారణమైతే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

అతివలకు ఉపాధి.. నేతన్నకు నిరాశ


వర్కర్ టూ ఓనర్ పథకంలో అందించే మరమగ్గాలు
అపెరల్ పార్కులో ఉపాధి పొందుతున్న మహిళలు

● అపెరల్ పార్కుకు తరలివస్తున్న అంతర్జాతీయ పరిశ్రమలు
● వీవింగ్ పార్కులో యూనిట్ల స్థాపన లేక ఎదురుచూపులు

సిరిసిల్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం స్వశక్తి చీరల ఆర్డర్లు భరోసా కల్పిస్తోంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో బీడిలు చుట్టే కార్మికులు, వస్త్రోత్పత్తి రంగంలో ఉన్న మహిళలకు గార్మెంట్ రంగంలో ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంది. ఆ దిశగానే సిరిసిల్ల శివారులోని సర్దాపూర్- పెద్దూర్‌ల వద్ద మహిళల కోసం గార్మెంట్ రంగంలో పరిశ్రమలు తీసుకవచ్చేందుకు అపెరల్ పార్కు, వీవింగ్ పార్కు ఏర్పాటు చేసింది. అపెరల్ పార్కులో వస్తున్న యూనిట్లతో మహిళలకు ఉపాధి లభిస్తుండగా, వీవింగ్ పార్కులో వర్కర్‌టు ఓనర్ పథకం కోసం నేతన్నలు ఎదురుచూస్తూ నిరాశ చెందుతున్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా సిరిసిల్ల పెద్దూర్ శివారులో మహిళ కార్మికుల కోసం 60 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ రూ. 174 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లను కేటాయించారు. అపెరల్ పార్కులో గార్మెంట్ రంగంలో మహిళలకు ఉపాధి పొందే దిశగా మహిళలకు జూకీ కుట్టుమిషన్లపై మహిళలకు శిక్షణను అందిస్తున్నారు. ఇదే క్రమంలో అపెరల్ పార్కులో 2021 ఏప్రిల్‌లో గోకుల్‌దాస్ ఇమేజ్ గార్మెంట్ సంస్థ యూనిట్‌ను ప్రారం భించింది. 800మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ ప్రారంభించిన యూనిట్‌ను 1,600మందికి ఉపాధి కల్పించే దిశగా విస్తరించింది. సిరిసిల్ల నుంచి నేరుగా విదేశాలకు రెడీమేడ్ వస్త్రాలు ఎగుమతి చేస్తోంది. ఈసంవత్సరం ఏప్రిల్ మాసంలో బెంగుళూరుకు చెందిన అంతర్జాతీయ గార్మెంట్ రంగ సంస్థ టెక్స్‌పోర్టు కంపెనీ యూనిట్‌ను ప్రారంభించింది. ఈ కంపెనీ ద్వారా రెండు వేల మందికి ఉపాధి లభించనుంది. ఇతర గార్మెంట్ కంపెనీలు కూడా పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నాయి.

● వర్కర్ టు ఓనర్ పథకానికి నేతన్నల ఎదురుచూపులు

సిరిసిల్ల శివారులో నేతన్నలకు ఉపాధికి వారధిగా ఉన్న అపెరల్ పార్కు, వీవింగ్ పార్కులపై ఆశలు పెట్టుకున్న నేత కార్మికులు, వస్త్రోత్పత్తి దారులకు ఎదురు చూపులు మిగిలాయి. అపెరల్ పార్కులో యూనిట్లు ప్రారంభం అవుతుండగా కార్మికులను యజమానులుగా మార్చే వర్కర్ టు ఓనర్ పథకం కోసం నిరీక్షణ తప్పడం లేదు. ఈ సంవత్సరం మొదట్లో మరమగ్గాల యూనిట్లను స్థాపించే విధంగా కసరత్తు ప్రారంభించినా ముందుకు కదలడం లేదు. గత ప్రభుత్వం చేపట్టిన వర్కర్‌టు ఓనర్ పథకంపై ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం, నిర్మాణం పూర్తి చేసుకున్న షెడ్లలో ఇతర సంస్థలకు లీజుకు ఇవ్వడంతో పవర్‌లూం కార్మికుల్లో పథకంపై ఆశలు సన్నగిల్లాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రూ 386.88 కోట్లతో పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే పథకాన్ని అమలు చేయడానికి సన్నాహాలు ప్రారంభించడంతో కార్మికుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. యాక్షన్ ప్లాన్ ఏంటో కనిపించకపోవడంతో..

- మిగతా 8లో

సీపీఆర్‌తో ప్రాణాన్ని కాపాడవచ్చు

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత


సీపీఆర్‌పై శిక్షణ పొందుతున్న ఏఎన్‌ఎంలు

సిరిసిల్ల, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఎవరైనా గుండెపోటుకు గురైనప్పుడు, నీటిలో మునిగి శ్వాస ఆగిపోయినప్పుడు అత్యవసర చికిత్సగా సీపీఆర్ ద్వారా ప్రాణాన్ని కాపాడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు సీపీఆర్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ ఒక వ్యక్తి గుండెపోటుకు గురికావడం లేదా శ్వాస ఆగిపోవడం ద్వారా మెదడు ఇతర అవయవాలకు ఆక్సిజన్ అందని పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం వల్ల వ్యక్తి ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్ విధానంపై అవగాహన పొందాలని సూచించారు. సీపీఆర్‌పై ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సంపత్ కుమార్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నయిమాలు అవగాహన కల్పించారు.

బతుకమ్మ చీరల సబ్సిడీలను అందించాలి


సిరిసిల్లలో ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో గతంలో తయారు చేసిన బతుకమ్మ చీరలకు రావాల్సిన పదిశాతం యారన్ సబ్సిడీలను రాష్ట్ర ప్రభుత్వం అందించి కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నాయకులు ధర్నాచేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ సిరిసిల్లలో 2018 సంవత్సరం నుంచి 2022 వరకు మరమగ్గాల కార్మికులకు ప్రభుత్వం స్థానిక కార్మికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులకు కూడా కూలీ సర్దుబాటు పేరుతో పదిశాతం యారన్ సబ్సిడీ అందించిందన్నారు. 2023 సంవత్సరంలో తయారుచేసిన బతుకమ్మ చీరలకు స్థానిక కార్మికులకు మాత్రమే అందించి ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులకు నిలిపివేయడం జరిగిందన్నారు. యారన్ సబ్సిడీలను వారికి అందించి అదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిమల్లె సత్యం, మూషం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల మేలు కోసమే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ఇల్లంతకుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారీల బారినపడి నష్టపోవద్దనే ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, చిక్కుడువానిపల్లె, అనంతారం, ముస్కానిపేట, గాలిపెల్లి గ్రామాలలో సోమవారం ప్యాక్స్ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకవచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ ఏడాది ధాన్యం మద్దతు ధరను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ. 2,389, సాధారణ రకానికి రూ2.369 మద్దతు ధర ఇస్తుందన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా వరిధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, ఏపీఎం లత మంగేశ్వరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, మాజీ ప్యాక్స్‌చైర్మెన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు పసుల వెంకటి, సంజీవ్, మామిడి రాజు, అంతగిరి, తీగల పుష్పలత, గొడుగు తిరుపతి, కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, రజనీకాంత్, వెంకటరెడ్డి, రాజేశం, వీరేశం, జ్యోతి, సురేందర్‌రెడ్డి, తిరుపతి, హరికుమార్, మల్లేశంలతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.


ముస్కానిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మండల పరిషత్ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 71మందికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. కార్యక్రమంలో నేరెళ్ల విజయ్, భాస్కర్‌రెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య సమాజం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్య సమాజం నిర్మితమవుతోందని ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి అన్నారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామంలోని రైతు వేదికలో సోమవారం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఉమారాణి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందని అన్నారు. అనంతరం పోషక విలువలతో కూడిన వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలి


పొత్తూరులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల కార్మికులతో స్థానిక కార్మికులకు ఉపాధి లభించడం లేదని స్థానికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలో సోమవారం హమాలి కార్మికసంఘం జిల్లా నాలుగవ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్మికులు ఎక్కువగా ఉన్నందున ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. హమాలీలకు ఆరోగ్యబీమాతో పాటు రూ. 25లక్షల ప్రమాద బీమా కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా హమాలీ సంఘాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా భూంపెల్లి భూంరెడ్డి, గౌరవ అధ్యక్షుడుగా అజ్జ వేణు, ముఖ్యసలహాదారుగా కడారి రాములు, ఉపాధ్యక్షులుగా తాండ్ర ఎల్లయ్య, గుంటి రాజయ్య, ప్రధానకార్యదర్శిగా బచ్చుపల్లి శంకర్, కార్యదర్శులుగా మల్లయ్య, శంకర్, మొండయ్య, సహాయకార్యదర్శిగా భూదన్న, కోశాధికారిగా గణేష్‌లతో పాటు కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఈ నెల 26న వేములవాడలో జరిగే ఏఐటీయూసీ 40వ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రావనపెల్లి మల్లేశంలతో పాటు వివిధ గ్రామాల హమాలీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో రాజన్న దర్శనాలు నిలిపివేయవద్దు

● బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్


మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో అభివృద్ధి పేరుతో రాజన్న దర్శనాన్ని నిలిపి వేసి భక్తుల మనోభావాలను దెబ్బతీయకుండా చూడాలని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయకుండా చూడాలన్నారు. ఆలయం అభివృద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదని రాజన్న క్షేత్రంలో బాలాయయాన్ని ప్రాణప్రతిష్ఠ చేసి భక్తులకు రాజన్న దర్శన భాగ్యం కల్పించాలన్నారు. ఆలయం అభివృద్ధి పేరుతో రాజన్నకు బదులుగా భీమన్న ఆలయంలో దర్శనాలు చేసుకోవాలని ఆలయ అధికారులు ప్రకటించడం సరికాదన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, పట్టణ మహిళామోర్చా అధ్యక్షురాలు వేముల వైశాలి సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మెర్గు శ్రీనివాస్, మోర శ్రీహరి, దూడం సురేష్, వంగ దేవేందర్‌రెడ్డి, దూరం వినయ్,కాంభోజు శ్రీధర్, శేఖర్, అభి, రాహుల్, మరళి, కనకయ్య ఉన్నారు.

ఫిర్యాదులన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం

● ఎస్పీ మహేష్ బి.గితే


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేష్ బి గీతే

సిరిసిల్లక్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజల వద్ద నుండి స్వీకరించే పిర్యాదులన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చే యడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్‌డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

చెస్ పోటీల్లో ముస్తాబాద్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రాజిరెడ్డి ఉపాధ్యాయులు

ముస్తాబాద్, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ మండల స్థాయి చెస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. అండర్ 17 విభాగంలో పదో తరగతికి చెందిన నీరటి హర్షిణి, బాలుర విభాగంలో పదో తరగతికి చెందిన ఎండీ ఇర్ఫాన్ అండర్ 17 విభాగంలో ఏడవ తరగతి చదువుతున్న గురుకు మనస్విని ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నిమ్మ రాజిరెడ్డి, పీఈటీ రాజశేఖర్ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

కోతుల బెడదతో బెంబేలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వానర బెడద రోజురోజుకు అధికమవుతోంది. కోతుల గుంపు నానా హంగామా సృష్టిస్తోంది. సోమవారం రాత్రి వానర దండు స్థానిక పెట్రోల్ బంకులోకి చేరింది. వాహనదారులపై దాడులకు దిగింది. భయంతో వాహనాలను వదిలి పరుగులు తీయాల్సి వచ్చింది. కోతుల బాధ నుంచి రక్షించుకునేందుకు యువకులు కర్రలు పట్టుకుని వెళ్లగొట్టేందుకు యత్నించారు. సుమారు రెండు గంటల పాటు కోతులతో వేగలేకపోయారు. అతి కష్టం మీద అక్కడ నుంచి కోతులను వెళ్లగొట్టారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.


ఎల్లారెడ్డిపేటలోని పెట్రోల్ బంకులో వానర దండు

రైతుల వాహనాలకు జరిమానా పడకుండా చూడాలని వినతి

ఇల్లంతకుంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) వ్యవసాయ పనులకు వెళ్లే రైతుల వాహనాలకు జరిమానాలు పడకుండా చూడాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు రైతులు విన్నవించారు. ముస్కానిపేట గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే రాగా రైతులు తమ సమస్య విన్నవించారు. కొనుగోలు కేంద్రానికి వెళ్లేటప్పుడు, బావుల వద్దకు పోయేటప్పుడు పోలీసులు ద్విచక్ర వాహనాల ఫొటోలు తీసి జరిమానాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు పనిచేస్తున్నారని చట్టప్రకారం వారి పనులు వారు చేసుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానిది మోసపూరిత వాగ్దానాల పాలన

● చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


బోయినపల్లిలో బాకీ కార్డును పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్

బోయినపల్లి అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె శంకర్ అన్నారు. బీఆర్ఎస్ ముద్రించిన కాంగ్రెస్ బాకీ కార్డులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో సోమవారం బోయినపల్లిలో ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలతో పాటు హామీలు ఇచ్చి అమలు చేయ క ప్రజలకు బాకీ పడ్డారని, ఈ బాకీలపై రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అధికారం కోసం అడ్డమైన హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమవ్వడమే కాకుండా అధికారం చేపట్టిన నెలల్లో రూ.లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయిం చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేవలం వంద రోజుల్లో రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీతో పాటు ఎకరాకు రూ. వేల రైతు భరోసా ఇస్తామని, పింఛన్లు రెట్టింపు చేస్తామని, విద్యార్థినులకు స్కూటీలు అందిస్తామని, నిరుద్యోగులకు భృతి ఇస్తామని హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను పూర్తిగా వంచించారని ఆరోపించారు.

అంతేకాకుండా గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ నాయకులు నేడు ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడగడానికి వస్తారన్నారు. బీఆర్ఎస్ అందజేసిన బాకీ కార్డులను చూపిస్తూ ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతనే ఓట్లు వేస్తామని చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెర పాక కొండయ్య, మాజీ ఎంపీపీ సత్తినేని మాధవ్, మాజీ జెడ్పీటీసీ కొనుకటి లచ్చిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిందం రమేష్, కొంకటి శేఖర్, తదితరులు ఉన్నారు.

ఇద్దరు కూలీల మధ్య ఘర్షణ.. ఒకరి మృతి

చిగురుమామిడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముల్క నూర్‌లో గల శాతవాహన బ్రీడింగ్ హేచరీస్ ప్రైవేట్ కంపెనీలో సోమవారం ఇద్దరు కూలీలు ఘర్షణ పడగా.. అందులో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై కె స్వాతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కంపెనీలో పనుల చేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన దాసోసోరెన్, ఖాన్ అన్యేవ్యక్తులు ఘర్షణ పడ్డారు. అందులో ఖాన్ అనేవ్యక్తి దాసో సోరెన్‌ను మొదటి అంతస్తు నుంచి కిందికి తోసి వేశాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమ్మిత్తం అతన్ని కరీంనగర్‌కు 108లో తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ మృతిచెందినట్లు తెలిపారు. సూపర్‌వైజర్ ఎస్‌కె అర్షిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని తిమ్మాపూర్ సీఐ గడ్డం సదన్‌కుమార్ పరిశీలించారు.

ఉరి వేసుకొని ఒకరి బలవన్మరణం

చిగురుమామిడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాం పూర్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి శ్రీనివాస్(45) జీవితంపై విరక్తిచెంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కె స్వాతి తెలిపారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీనివాస్ కొద్ది రోజులుగా మద్యానికి బానిస య్యాడు. దీంతో అతనితో గొడవపడి ఎనిమిది నెలల క్రితం భార్య గీత తన తల్లి గారి ఇంటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెందిన శ్రీనివాస్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడు శ్రీనివాస్ కొడుకు అరవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానేరువాగులో పడి ఒకరి మృతి

ఇల్లంతకుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన బండారి వెంకటయ్య(48) అనే కూలీ స్నానానికి వెళ్లి మానేరువాగులో పడి మృతిచెందినట్లు అదనపు ఎస్సై లక్ష్మీ తెలిపారు. వెంకటయ్య గ్రామంలో హమాలీ పనిచేస్తూ జీవిస్తుంటాడు. కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం సాయంత్రం పనిచేసి గ్రామసమీపంలోని మానేరువాగులోకి స్నానానికి వెళ్లాడు. బట్టలు ఉతికి సైకిల్‌పై ఆరవేశాడు. రాత్రి ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు గాలించారు. సోమవారం ఉదయం గ్రామస్థులు వాకింగ్‌కు మానేరు వంతెనపైకి వెళ్లగా నీటిలో మృతదేహం కనిపించింది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి నదిలో పడి యువకుడి మృతి

మంథనిరూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాన్‌సాయి పేటవద్ద గోదావరి నదిలో మునిగి సోమవారం యువకుడు మృతిచెందాడు. కిషన్ అనే రైతుకు గోదావరి ఒడ్డున పొలం ఉంది. గోదావరి వరదల కారణంగా పంటలసాగుకోసం నదిలో మోటారు అమర్చుకోగా దానిని తీయడానికి రాజు, గామిడి సూర్య వెళ్లారు. మోటారు తీస్తున్న క్రమంలో సూరి(21) అనేయువకుడు నదిలో గల్లంతయ్యాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్థులు గాలించారు. చివరికి మృతదేహాన్ని గుర్తించారు. మంథని ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ సిబ్బంది ఫైర్‌ఆఫీసర్ శివశంకర వరప్రసాద్, ఫైర్‌మెన్ శ్రావణ్‌కుమార్, ఆపరేటర్లు చందర్, నాగరాజు ఎల్‌మడుగు వద్దకు చేరుకొని రెస్క్యూ చేసి సూరి మృతదేహాన్ని నది నుంచి వెలికితీశారు.


సూరి(ఫైల్)

వివాహిత ఆత్మహత్య

మల్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అత్త, మామ, ఆడబిడ్డలతో పాటు మరోవ్యక్తి వేధింపులకు గురిచేయడంతో గుర్రం సుమలత(28) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపినవివరాల ప్రకారం మెట్‌పల్లిమండలం వెల్లుల్ల గ్రామానికిచెందిన గుర్రం సుమలతకు మల్యాల మండలం రాజారం గ్రామానికిచెందిన గుర్రం నర్సయ్యతో 13సంవత్సరాల క్రితం వివాహంజరిగింది. నర్సయ్య నాలుగునెలల క్రితం ఉపాధికోసం దుబాయి వెళ్లగా సుమలత తనపిల్లలతోకలిసి అత్తగారింట్లో ఉంటోంది. సుమలత సోమవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసు కుంది. మృతురాలితండ్రి బోదాసుగంగాధర్ ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆటో బోల్తా... ఒకరికి తీవ్ర గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాలనీ చౌరస్తాలో సోమవారం రాత్రి ఆటోబోల్తా పడిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం ప్రకారం.. ఆటో డ్రైవర్ గణేష్ ఆటోలో ప్రయాణికుడిని ఎక్కించుకుని చౌరస్తా దాటుతున్న సమయంలో సైకిల్ అడ్డువచ్చింది. గణేష్ సైకిల్‌ను తప్పించే క్రమం లో ఆటో సైకిల్‌ను, పక్కనే ఉన్న టీస్టాల్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆటోడ్రైవర్ గణేష్‌కు స్వల్ప గాయాలు కాగా ఆటోలో ఉన్న ప్రయాణికుడు స్వామి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన గణేష్‌ను 108లో స్థానికులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మధ్యాహ్న భోజనశాలలు
పూర్తయ్యేదెన్నడో..?

- నిధుల కొరతతో ముందుకు సాగని పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

కథలాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన శాలల నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనశాలలు నిర్మించాలని నిర్ణయించింది. ఒక్కో భవనానికి రూ.14.5 లక్షల ఉపాధిహామీ నిధులు కేటాయించారు. కథలాపూర్ మండలంలోని సిరికొండ, గంభీర్‌పూర్, కథలాపూర్, బొమ్మెన గ్రామాలకు నిధులు మంజూరు చేయగా స్థానిక పాఠశాల కమిటీ ఛైర్మన్లు భవన నిర్మాణ పనులుకు శ్రీకారం చుట్టారు. కానీ సిరికొండ, గంభీర్‌పూర్, కథలాపూర్ గ్రామాల్లో భవన నిర్మాణ పనులు పిల్లర్ల దశకు చేరుకోగా బిల్లులు రాకపోవడంతో అర్ధాం తరంగా పనులు నిలిచిపోయాయి. ఒక్కో కాంట్రాక్టర్ సుమారు రూ.6 లక్షల మేర పనులు చేయగా అదే సమయంలో ప్రభుత్వం మారడంతో బిల్లులు విడుదల కాలేదు.


సిరికొండలో పిల్లర్లకే పరిమితమైన భోజనశాల నిర్మాణం

నిర్మాణం కోసం తెచ్చుకున్న స్టీల్, సిమెంట్ వానలకు తడిచి పోయి మరింత నష్టం వాటిల్లిందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనశాలలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


గంభీర్‌పూర్‌లో పిల్లర్లకే పరిమితమైన నిర్మాణం

నిధులు విడుదల చేయాలి
దొప్పల జలందర్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్, సిరికొండ



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనశాలల నిర్మాణానికి నిధులు విడుదల కాక పనులను అర్థాంతరంగా నిలిపివేయాల్సి వచ్చింది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

జమ్మికుంటలో జోరుగా
గుట్కా దందా..

జమ్మికుంట రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో గుట్కావ్యాపారం జోరుగా సాగుతోంది. అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ.. ఈ వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండాపోయింది. మండలవ్యాప్తంగా కొంతమంది దళారులు డీలర్ల అవతారం ఎత్తి గుట్కాను పక్కరాష్ర్టాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుసున్నది. రాత్రి, తెల్లవారుజామున ప్రత్యేక వాహనాల్లో గుట్కా, అంబార్ ప్యాకెట్లు వస్తున్నాయి. చాలామంది గుట్కా, అంబార్, పాన్‌మసాలకు అలువాటు పడటంతో ఈ దందా జోరుగా సాగుతోంది. ప్రధానంగా యువత వీటి బారిన పడుతూ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారు.

● తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం..

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండటంతో పలువురు ఈ వ్యాపారంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తున్నది. దుకాణదారుల అవసరాలను బట్టి డీలర్లు సరఫరా చేస్తుంటారు. రూ.10 విక్రయించాల్సిన అంబర్ ప్యాకెట్‌ను రూ.30వరకు విక్రయిస్తున్నారు. కొంతమంది వారి దుకాణాల వరకు చాటుమాటున విక్రయిస్తుంటే, మరి కొంతమంది పెద్దఎత్తున దిగుమతి చేసుకొని చిన్నచిన్న దుకాణాలకు సరఫరా చేస్తూ లక్షల్లో లాభాలు ఆర్జిస్తున్నా రు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిషేదిత గుట్కా, అంబార్ ప్యాకెట్ల విక్రయదారులపై చర్యలు తీసు కుంటారో లేదో చూడాలి.

అప్పుల భారంతో వ్యాపారి ఆత్మహత్య

- వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నట్లు సూసైడ్ నోట్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్ 1వ బైపాస్ రోడ్డు సమీపంలో గల శ్రీలక్ష్మి గణేష్ కళా ఆర్ట్స్ కేంద్రంలో వికృతి శేఖర్(50) అనేవ్యాపారి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు రాసిన నాలుగుపేజీల సూసైడ్ లేఖ లభ్యమైంది. సిరిసిల్ల పట్టణంలోని అనంత నగర్‌కు చెందిన శేఖర్ కొంతకాలంగా 1వ బైపాస్ రోడ్డులో శ్రీలక్ష్మి గణేష్ కళాఆర్ట్స్ పేరిట వినాయక విగ్రహాలు తయారుచేసి విక్రయిస్తున్నాడు. సూసైడ్‌కు ముందు తను రాసిన లేఖలో జిల్లా కలెక్టర్, ఎస్పీలకు పేర్కొన్న వివరాల ప్రకారం.. శేఖర్‌కు వినాయక విగ్రహాల తయారీ, విక్రయ వ్యాపారంలో రూ. 1.80కోట్ల నష్టం వాటిల్లింది. 15మంది వడ్డీ వ్యాపారుల వద్ద దాదాపు రూ.1.32కోట్ల అప్పు చేశాడు. అయితే వడ్డీవ్యాపారులకు ఇప్పటికే రూ.1.29కోట్లు చెల్లించాడు. అప్పు ఇచ్చిన వారిలో బాలసాని అంజయ్య అనేవ్యక్తి శేఖర్‌ను, అతని భార్యను, పిల్లలను బెదిరింపులకు గురిచేశాడు. దీంతో తీవ్ర ఒత్తిడిలోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నానని పేర్కొన్నాడు. అంజయ్య శాంతినగర్‌లో ఉన్న తన ఫ్లాట్ లాక్కోవాలని చూస్తున్నాడని. ఇప్పటికే అతనికి రూ.38లక్షల అప్పునకు రూ.45 లక్షలు చెల్లించానని పేర్కొన్నాడు. అయినప్పటికీ అనేక ఇబ్బందులు పెట్టాడని, వేధింపులు భరించలేక పోయానని పేర్కొన్నాడు. మరో వడ్డీ వ్యాపారీ బాలసాని ముత్తయ్య తన ఇల్లు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నాడు. గ్రూప్ నంబర్5లో మెంబర్‌షిప్ ఉందని చిన్న కొడుకుకు ఇవ్వాలని ఎక్సైజ్ సూపరిండెంట్‌ను కోరాడు. షెడ్ కిరాయి ఇంకా ఉంది. రూ.16లక్షలు కొందరికి చెల్లించమని తన బావమరిది సాంబయ్యకు రాశాడు. నేను చాలామందికి అప్పు ఉన్నాను. ఆస్తిఅంతా నా పిల్లలకు ఇవ్వాలని.. ఇదే నా మరణ వాంగ్మూలమని.. నన్ను క్షమించండంటూ రాశాడు. మృతుడికి భార్య వసుంధర, కుమారులు అఖిల్, మణిదీప్ ఉన్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ కృష్ణ పరిశీలించారు. సూసైడ్‌నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వడ్డీ వ్యాపారి చంపుతానని బెదిరించడం వల్లనే శేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.


శేఖర్(ఫైల్)

రోడ్డుపైకి ప్రమాదకరంగా చెట్ల కొమ్మలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మానకొండూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై మానకొండూర్ శివారులో రోడ్డు పక్కన ఉన్న చెట్లకొమ్మలు వ్యాపించి ప్రయాణికులకు రోడ్డు కనిపించడం లేదు. గ్రామ శివారులోనే ఓ వ్యవసాయబావి ఉంది. ఆ బావి చుట్టూ వివిధ రకాల చెట్లు ఉన్నాయి. ఆ చెట్లు బావి కనిపించకుండా చేయడమే కాకుండా రోడ్డు మధ్య వరకు కొమ్మలు వచ్చి రాకపోకలకు ఇబ్బందులు కల్గిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ చెట్లను తొలగించలేదు. కనీసం ప్రమాద సూచిక ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు రోడ్డుపై ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాదసూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


మానకొండూర్‌లో సగం రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలు

చోరీపై పోలీసుల విచారణ

పాలకుర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని గుడిపెల్లి గ్రామ పంచాయతీకిచెందిన చెత్తసేకరణ వాహనానికి సంబంధించిన బ్యాటరీ, టైరుచోరీపై సోమవారం పోలీసులు విచారణ చేపట్టారు. ఈనెల10న గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిలిపి ఉన్న ట్రాలీఆటో బ్యాటరీ, టైరు చోరీకి గురైందని పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చిగురుమామిడి ఎంపీడీవో సస్పెన్షన్

చిగురుమామిడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాన మధుసుదన్‌ను క్రమశిక్షణ చర్యలో భాగంగా సస్పెన్షన్ చేసినట్లు, జిల్లా కలెక్టరు నుంచి ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది. ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో మండలంలో రేకొండ గ్రామంలోని 14వ వార్డులో, చిగురుమామిడి 3వవార్డులో రిజర్వేషన్ విషయంలో ఆన్‌లైన్‌లో తప్పు చేసినట్లు బయటపడడంతో జిల్లా కలెక్టరు ఆయనను సస్పెన్షన్ చేసినట్లు తెలిసింది. ఆయన స్థానంలో ఎంపీడీవోగా ప్రస్తుతం ఇంకా ఎవ్వరికీ బాధ్యతలుఇవ్వలేదని సమాచారం.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మంథని, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌పూర్ శివారులోని మానేరునది నుంచి ఇసుక అక్రమరవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐరమేష్ సోమవారం తెలిపారు. వేల్పులఅశోక్, అక్కపాక శశికుమార్, రాచర్ల నాగరాజు, పర్ష ఓదెలు, పొన్నాల సురేష్, కటకం సదయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లనుస్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమరవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కరీంనగర్ క్రైం: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడుట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చేగుర్తి, శ్రీనివాసనగర్, దుర్శేడ్ గ్రామాలకు చెందిన ట్రాక్టర్‌డ్రైవర్లపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

నాటుసారా పట్టివేత

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శంకర్ నాయక్‌తండాల్లో ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఇంట్లో నిల్వచేసిన 8లీటర్ల సారా, 100లీటర్లపానకం, ముడిపదార్థాలను స్వాధీనపర్చుకున్నారు. తయారీదారులు కేలోతు రమేశ్, కేలోతు శంకర్, భూక్య భూలీలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. సారాతయారీ, అమ్మితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.


స్వాధీనపర్చుకున్న సారా, ముడి పదార్థాలతో ఎస్ఐ లక్ష్మణ్

ధరూర్‌లో నాలుగు ఇళ్లలో చోరీ

- 8 తులాల బంగారం, ద్విచక్రవాహనం ఎత్తుకెళ్లిన దొంగలు

జగిత్యాలరూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి తాళాలు వేసి ఉన్న నాలుగు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడి 8తులాల బంగారం, 45తులాల వెండితో పాటు రూ.2.20లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ధరూర్ గ్రామంలో ఆదివారం రాత్రి ఓ పెళ్లి భారత్ కొన సాగుతుండగా ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని దొంగలు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేశారు. ధరూర్ గ్రామానికి చెందిన మంథని కవిత, షేక్ షబానా, ద్యాగల నరేష్, శ్రీనివాస్ ఇళ్ల తాళాలు పగులకొట్టి అందినకాడికి దోచుకెళ్లారు. బాధితులు జగిత్యాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగిత్యాలరూరల్ సీఐ సుధాకర్ ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించారు.


బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ సుధాకర్

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన మరో కారు

తిమ్మాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుభాష్‌నగర్ స్టేజివద్ద సోమవారం రాత్రి రాజీవ్‌రహదారి పక్కన ఆగిఉన్న కారును వెనుకల నుంచి వచ్చిన మరోకారు ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ స్టేజి వద్ద ఆగిఉన్న ఓ కారును వెనుకల నుంచి మరోకారు అతివేగంగా వచ్చిఢీకొంది. ఈప్రమాదంలో ఆగిఉన్న కారులోని భార్య, భర్తలతో పాటు బాలుడికి గాయాలైనట్లు సమాచారం. గమనించిన స్థానికులు వెంటనే వేరేకారులో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.


ఆగిఉన్న కారును ఢీకొన్న మరో కారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుట్లపేట గ్రామశివారులో సోమవారం రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన శ్రీనివాస్, నర్సయ్య గాయపడ్డారు. క్షతగాత్రులను మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాచర్లగొల్లపల్లి నుంచి నాగంపేటకు చెందిన శ్రీనివాస్, నర్సయ్య బైక్‌పై స్వగ్రామానికి వెళుతున్నక్రమంలో ఓకారు ఢీకొట్టింది.

ద్విచక్రవాహనంపై ఉన్న శ్రీనివాస్, నర్సయ్య గాయాలపాలయ్యారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఉమ్మడికరీంనగర్ జిల్లాలో జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

కోరుట్ల రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం వేంకటాపూర్ గ్రామశివారులో జరిగిన రోడ్డుప్రమా దంలో కోరుట్ల పట్టణానికిచెందిన వినోద్(29) అనే యువకుడు మృతిచెందినట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు.కోరుట్ల పట్టణంలోని ఐబీ రోడ్డుకు చెందిన వినోద్ ఎలక్ట్రీషియన్. సోమవారం కోరుట్ల మండలం మోహన్ రావుపేటకు వెళ్లి కోరుట్లకు తిరిగివస్తున్న సమయంలో వెంటకటాపూర్ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనిసంఘటన స్థలంలోనే వినోద్ మృతిచెందాడు. వినోద్‌కు భార్య చందనతోపాటు ఎనిమిది నెలల కుమారుడు ఉన్నాడు.


వినోద్(ఫైల్)

ఆర్నకొండలో..

చొప్పదండి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో యువకుడు మరణించాడని ఎస్ నరేష్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. సుల్తానాబాద్ మండలం పూసాలకుచెందిన మెరుగు సాయికిరణ్(20) తన మిత్రుడు జడల మహేశ్‌తో కలిసి బైక్‌పై ఆర్నకొండకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో రాయపట్నం రహదారిపై కరీంనగర్ నుంచి లక్షెట్టిపేట వెళుతున్న పాలవ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికిరణ్ అక్కడికక్కడే మరణించగా బైక్‌పైవెనకాల కూర్చున్న మహేశ్‌కు గాయాలయ్యాయి. మృతుడు సాయికిరణ్ తండ్రి మెరుగు శంకరయ్య ఫిర్యాదు మేరకు డీసీఎంవ్యాన్ డ్రైవర్ ముదేళ్లరాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతిరెడ్డి పేట గ్రామానికి చెందిన చింత సమ్మయ్య(46) వృత్తిరీత్యా గీత కార్మికుడు. సోమవారం రాత్రి సమ్మయ్య తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సమ్మయ్య తలకు తీవ్రగాయాలై మృతిచెందాడు. సమ్మయ్య వాహనాన్ని ఢీకొట్టిన వాహనదారుడు మెట్‌పల్లి క్వారీనుంచి వస్తున్న నీరాల రాకేష్‌గా గుర్తించారు. ఈ ఘటనలో రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.


సమ్మయ్య(ఫైల్)


సంచిని అప్పగిస్తున్న ఎస్సై


నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రంగంపల్లికి చెందిన పర్లేళ్ల లక్ష్మి సోమవారం రంగంపల్లి నుంచి జెండా చౌరస్తాకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. అయితే జెండా చౌరస్తా రాగానే వెంటతెచ్చుకున్న సంచిని ఆటోలోనే వదిలేసి దిగిపోయింది. ఆటోడ్రైవర్ కుంభాల ప్రభుదేవా గుర్తించి సంచిని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైకి అప్పగించాడు. పోలీసులు ఆమె ఆచూకీ గుర్తించి అందజేశారు. అందులో 17వేల రూపాయలు ఉన్నాయని, నిజాయితీని చాటుకున్న ఆటోడ్రైవర్‌ప్రభుదేవాను ఎస్సైలక్ష్మణ్‌రావు అభినందించారు.

నిరుపయోగంగా వారసంత సముదాయం

- గ్రామీణుల సౌకర్యార్థం నిర్మాణం
- ప్రారంభించినా వినియోగంలోకి రాని వైనం

కరీంనగర్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణుల సౌకర్యార్థం లక్షలు వెచ్చించి నిర్మించిన వారసంత సముదాయం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వంలో వారసంత సముదాయాల నిర్మాణాలు చేపట్టారు. ఇందుకోసం ఉపాధి హామీనిధులతో పాటు గ్రామ పంచాయతీ నిధులను మంజూరు చేశారు. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో గ్రామ సంత సముదాయం నిర్మించారు. ఇందుకోసం ఉపాధిహామీ నిధులు రూ.9లక్షలు, గ్రామపంచాయతీ నిధులు రూ.3.25లక్షలు వెచ్చించారు. ఆరుగ్రామాలకు అందుబాటులో ఈ సంత ఉపయోగపడుతుందని భావించారు. కరీంనగర్ మండలంలోని మందులపల్లి, చెర్లబూత్కూర్, అటు సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, సాంబయ్యపల్లి, నారాయణరావుపల్లి, దుబ్బపల్లి గ్రామాలకు సమీపంలో సముదాయం నిర్మించగా అప్పటి మంత్రి, ప్రస్తుతఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆగస్టు 2022లో ప్రారంభించారు. ఇప్పటికీ గ్రామస్థులకు అందుబాటులోకి తేలేక పోయారు. మరోవైపు ఉపయోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అన్ని హంగులతో నిర్మించిన గ్రామసంత మార్కెట్ ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మూడు సంవత్సరాల క్రితం ప్రారంభించిన శిలాఫలకం


మొగ్దుంపూర్‌లో వృథాగా మారిన వారసంత సముదాయం

సూక్ష్మ చిత్రకళారుడికి క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్



సర్టిఫికెట్లతో కళాకారుడు రజనీకాంత్

ఓదెల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడకకు చెందిన సూక్ష్మ చిత్రకళ ఉపాధ్యాయుడు, ఆడెపు రజనీకాంత్‌కు క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పెన్సిల్ గ్రాఫైట్ పై 0.4 మిల్లీమీటర్ల ఎత్తు 0.2 మిల్లీమీటర్ల వెడల్పు ఉన్న ప్రపంచంలోని అతి చిన్న జాతీయ పతాకాన్ని సుమారు గంటపాటు శ్రమించి తయారు చేసినందుకుగాను, ముంబైలోని ప్రధాన కార్యాలయం క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు వికాస్ బొండవే, పునీత్ మాదన్‌లు రజనీకాంత్‌కు ఈమెయిల్ ద్వారా సమాచారం అందించారు. సూక్ష్మ కళ నైపుణ్యంలో తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డులతో పాటు అంతర్జాతీయ, జాతీయ అవార్డులను రజనీకాంత్ అందుకున్నారు.

తుంగూర్‌లో కొండచిలువ పట్టుకొని అడవిలో వదిలేసిన యువకులు

బీర్‌పూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలోని ఓ ఇంట్లోకి ఆదివారం రాత్రి కొండచిలువ ప్రవేశించింది. గ్రామంలోని కొల్వాయికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న ఇంటిలోకి కొండచిలువ ప్రవేశించడంతో కాలనీ వాసులు ఆందోళన చెందారు. అక్కడే ఉన్న కొందరు యువకులు వచ్చి కొండచిలువను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలి వేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీరాంసాగర్ నుంచి 25 వేల క్యూసెక్కుల నీటి విడుదల

జగిత్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరికి సోమవారం 25 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువకు 5,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

తాటిచెట్టుపై పిడుగు

రాయికల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రామాజీపేట రోడ్డులోని కల్లు మండపం సమీపంలో ఉన్న తాటి చెట్టుపై పిడుగు పడటంతో మంటలు వ్యాపించాయి. వర్షానికి రోడ్లన్నీ జలమయం కావడంతో వ్యాపారులు, ఉద్యోగుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అందమైన అక్షరం

చేతి రాత మార్చేందుకు ప్రత్యేక శిక్షణ

దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించిన అక్షర్ సంస్థ

ఆసక్తి చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అక్షర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మేరాజ్‌అహ్మద్

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ చేతిరాత బాగా లేదని బాధపడాల్సిన అవసరం లేదు... మారాలన్న...మార్చుకోవాలన్న సంకల్పం ఉంటే చాలు సాధన చేయించేందుకు తాను ఉన్నానంటూ 'అక్షర్'. చేతి రాత మార్పుతో ఆలోచనలో కూడా మార్పు వస్తుంది... సమాజంలో ఉన్నత వ్యక్తిగా గుర్తింపు నిస్తుంది. అన్న నానుడి అక్షర సత్యమవుతున్నది...!

అందమైన దస్తూరి(చేతి రాత) కోసం గోదావరిఖనికి చెందిన అక్షర హ్యాండ్ రైటింగ్, పాజిటివ్ మోటివేషన్ అకాడమి కృషిచేస్తున్నది. మేరాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయుడు 2011లో అక్షర హ్యాండ్ రైటింగ్, పాజిటివ్ మోటివేషన్ అకాడమిని నెలకొల్పాడు. అలా మూడేళ్లుగా ఈ ప్రాంతంలో శిక్షణ ఇస్తున్నాడు. జూలై నుంచి ఏప్రిల్ మాసాలలో పాఠశాలల్లో ఆరు రోజులు, 11 రోజులు, 42 రోజులు శిక్షణ ఇస్తూ ఎంతో మంది చేతి రాతలను మార్చి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఇక వేసవికాలంలో కూడా శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి దస్తూరిపై ప్రత్యేక శిక్షణ ఇస్తు న్నారు. ఇప్పటి వరకు సుమారు 6 లక్షలకు పైగా మందికి చేతిరాతపై శిక్షణ ఇచ్చామని మేరాజ్ అహ్మద్ చెబుతున్నారు.

దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించిన అక్షర్...

గోదావరిఖని ప్రాంతంలో దశాబ్దాన్నర క్రితం నెలకొల్పిన అక్షర్ యజ్ఞం ఇంతింతై వటుడింతై అన్నట్టుగా కొనసాగుతున్నది.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తూ ఎంతో మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారుల దస్తూరి మార్చేసింది. తెలంగాణతో పాటు ఈ దస్తూరి యజ్ఞం దక్షిణాది రాష్ట్రాలకు విస్తరిస్తున్నది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎంతో మంది విద్యార్థుల దస్తూరి మార్చే లక్ష్యంగా ముందుకు వెళతున్నది అక్షర్ ఫౌండేషన్ ఆ దిశగా పని చేస్తున్నది.


చేతిరాత కాంపిటీషన్స్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులకే కాదు.. ఉపాధ్యాయులకు మారిన దస్తూరి...

నల్లబంగారు నేలలో పురుడు పోసుకున్న ఈ అక్షర్ ఫౌండేషన్ వందల మందితో మొదలైన ఈ అక్షర యజ్ఞం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మేరాజ్ అహ్మద్ స్థానిక విద్యాసంస్థల సహకారం తీసుకుంటూ ఏడాదికేడాది విద్యార్థుల దస్తూరిలో మార్పులు తీసుకువచ్చి ఎంతో మందికి దస్తూరి కాంపిటీషన్లలో ప్రతిభ చూపేలా కృషి చేశారు. అలా వందల విద్యార్థులతో మొదలై నేడు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలతో సుమారు 5లక్షల మంది విద్యార్థులు, లక్ష మంది ఉపాధ్యాయులతో పాటు ఆన్‌లైన్‌లో సుమారు 10వేల మంది డిగ్రీ, పీజీ, విద్యార్థులతో పాటు ఐఏఎస్ కోచింగ్ అభ్యర్థులు శిక్షణ పొందారు. అలాగే అక్షర్ ఫౌండేషన్ యేటా 20వేల మంది విద్యార్థులు రాష్ట్ర చేతి రాత పోటీల్లో ప్రతిభ చూపారు. 2వేల మంది ఉపాధ్యాయులు రాష్ట్ర హ్యాండ్ రైటింగ్ కాంపిటిషన్‌లో పాల్గొని ప్రతిభ కనపర్చారు.

హ్యాండ్ రైటింగ్‌కు పీరియడ్ కేటాయించాలి: మేరాజ్, అక్షర్ నిర్వాహకుడు



ఉపాధ్యాయుడిగా రెండు దశాబ్దాలుగా పనిచేశా. ఎంతోమంది విద్యార్థుల చేతిరాత బాగా లేకపోవడం దాని ప్రభావం మార్కులపై పడుతుంది. అందుకే నేను ప్రత్యేకంగా శిక్షణ పొంది అక్షర్ సంస్థను నెలకొల్పి చేతిరాత మార్పు కోసం శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను. అలా మొదలైన ఈ అక్షర్ ప్రస్థానం 15 ఏళ్లకు చేరింది. అలాగే దక్షిణాది రాష్ట్రాలకు విస్తరిస్తున్నది.

ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

● రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపికకు సింగరేణి సహకారం ● ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించాలని రామగుండం ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్ అన్నారు. సోమవారం సింగరేణి ఆర్‌సీ ఓఏ క్లబ్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా టోర్నమెంట్ ఎంపిక పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కరాటే క్రీడతో దేహదారుఢ్యంతో పాటు ఆత్మ రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల క్రీడానైపుణ్యాన్ని పెంపొందించేందుకు యేటా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పేరుతో టోర్నమెంట్లు, సెలక్షన్స్ నిర్వహిస్తుందన్నారు. ఎస్‌జీఎఫ్‌కు సంబంధించిన రాష్ట్రస్థాయి పోటీలకు, ఎంపిక నిర్వహణకు సింగరేణి సంస్థ నుంచి సహకారాన్ని అందిస్తామని జీఎం లలిత్ కుమార్ చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా టోర్న మెంట్‌లో పాల్గొని ప్రతిభ కనపర్చిన పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కు చెందిన అండర్ 14, అండర్ 17 విభాగాల్లో 44 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.


జీఎం లలిత్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

అనంతరం జీఎం లలిత్ కుమార్‌ను పెద్దపల్లి జిల్లా కరాటే అసోసియేషన్ ప్రతినిధులు, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొమురోజు శ్రీనివాస్, శోభ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి తగరపు శంకర్, జిల్లా కరాటే అసోసియేషన్ బాధ్యులు వడ్డేపల్లి సురేష్, కరాటే శ్రీనివాస్ రాజకుమార్, పసునూటి శంకర్, కొండ నాగరాజు, నవీన షైనీ, చందు, కూసం శ్రీనివాస్, సురభి వేణుగోపాల్, మన్నన్, లింగస్వామి, పవన్, శ్రీనివాస్, రమేష్, విజయ్‌కుమార్, జావిద్ పాల్గొన్నారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.1.08కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

మల్యాల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం హుండీల ద్వారా రూ. 1,08,72,591 ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీకాంత్ రావు తెలిపారు. 81 రోజులకు ఆలయంలోని 12 హుండీలను సోమవారం లెక్కించగా నగదుతో పాటు 55 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో లభించిన మిశ్రమ బంగారం, వెండిని సీల్ చేసి హుండీలలోనే వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఏసీ సుప్రియ, జగిత్యాల డివిజన్ పరిశీలకులు రాజమొగిలి, స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, రఘు, పర్యవేక్షకులు నీల చంద్రశేఖర్, దేశిని సునీల్, గుండి హరిహరనాథ్, అధికారులు, ఏఎస్సై రమణారెడ్డి పాల్గొన్నారు.

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

రాజన్న దర్శనానికి 5 గంటల సమయం


భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేస్తారనే ప్రచారం జోరుగా సాగడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. క్యూలైన్‌లో భక్తులు సుమారుగా 5 గంటలు నిరీక్షించి రాజన్న కోడె మొక్కు చెల్లించుకుని స్వామి వారి దర్శనం చేసుకున్నారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో రాజన్న ఆలయ ఈవో క్షేత్రస్థాయిలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు ఉద్యోగులను అప్రమత్తం చేస్తూ ఆలయంలోనే సాయంత్రం వరకు ఉన్నారు.

భక్తులతో సందడిగా మారిన భీమన్న ఆలయం

వేములవాడ భీమేశ్వర ఆలయంలో పనులు పూర్తి కావడంతో భక్తులతో సందడిగా కనిపించింది. రాజన్న ఆలయంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో భక్తులు భీమన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

ఇక రాజన్న దర్శనం ఎల్‌ఈడీ స్క్రీన్లలోనే

రాజన్న ఆలయ పరిసరాల్లోనే స్క్రీన్‌ల ద్వారా దర్శనం

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దర్శనం ఇక నుంచి ఎల్‌ఈడీ స్క్రీన్‌లలోనే చేసుకునేలా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నుంచి ఒక ప్రకటన సోమవారం రాత్రి విడుదలైంది. రాజన్న ఆలయ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అర్చకులు, వేదపండితుల విలువైన సూచనలు, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, తాత్కాలిక ఏర్పాట్ల ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2026వ సంవత్సరంలో సమ్మక్క, సారలమ్మ జాతరకు ముందు, జాతర తరువాత రాజన్న దర్శనం కల్పించేలా భక్తుల సౌలభ్యం కోసం ఏర్పాట్లు కొనసా గుతన్నాయని పేర్కొన్నారు.

ఎండోమెంట్ దృష్టికి తీసుకువెళ్లిన బండి సజయ్

రాజన్న ఆలయ పరిసరాల్లోనే ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, తాత్కాలిక ఏర్పాట్లతో స్వామి వారి దర్శనం చేసుకునేలా రాష్ట్ర దేవాదాయశాఖ దృష్టికి తీసుకు వెళ్లామని కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల మనోభావాలని పరిగణలోకి తీసుకోవాలని, సాధు సంతుల సూచనలు మేడారం జాతర దృష్ట్యా పరిగణలోకి తీసుకోవాలని సూచించడంతో వివాదాలకు తావివ్వకుండా ఏకాభిప్రాయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

అభివృద్ధి చేస్తూనే భక్తులకు దర్శనాలు కల్పించాలి

ఈవోకు వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు

రాజన్న ఆలయంలో అభివృద్ధి పనులను కొనసాగిస్తూనే భక్తులకు దర్శనం కల్పించాలని ఈవో రమాదేవికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి పేరుతో భక్తులకు దర్శనాలు దూరం చేయద్దని అన్నారు. బీజేపీ ఆలయ అభివృద్ధికి వ్యతిరేకం కాదన్నారు. భక్తుల మనోభావాలు పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. రాజన్న ఆలయం లోనే దర్శనాలు కల్పిస్తే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందనే భావన ఉందని తెలిపారు. కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్, శ్రీధర్, నవీన్ యాదవ్, సంతోష్‌బాబు, శేఖర్ ఉన్నారు.


ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

రాష్ట్రస్థాయి వాలీబాల్‌కు మోడల్ స్కూల్ విద్యార్థి


అనిల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

భగత్‌నగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తపల్లి మండలం ఎలగందల్ మోడల్‌స్కూల్ విద్యార్థి ఎస్.అనిల్ ఎంపికయ్యాడు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటాడు. అనిల్‌ను ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్, పీడీ హరీష్ అభినందించారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రాలో సత్తా చాటిన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆంధ్రజ్యోతి 13: సెపక్ తక్రా 11వ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలబాలికలు సత్తా చాటారు. టీం విభాగంలో నాలుగు పతకాలు సాధించారు. ఈ నెల 10 నుంచి 12వరకు ఆసిఫాబాద్ జిల్లా గోలేటి టౌన్‌షిప్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో కరీంనగర్ క్రీడాకారిణులు రజత పతకాన్ని కైవసం చేసుకోగా సబ్ జూనియర్ బాలుర విభాగంలో, జూనియర్స్ బాలబాలికల విభాగంలో కాంస్య పతకాలు సొంతం చేసుకున్నట్లు కరీంనగర్ జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్ను విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పతకాలు సాధించిన జిల్లా జట్లకు కోచ్, మేనేజర్లుగా జి.కుమార్, శ్రీనివాస్, అజయ్, సుమన్, శ్రీకాంత్ వ్యవహరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు కన్న కృష్ణ, జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు ఎన్.మహిపాల్, జి.జనార్ధన్‌రెడ్డి, టి.రమేష్‌రెడ్డి, ఎన్.సిద్ధారెడ్డి, ఎండీ కరీం అభినందించారు.

జాతీయ పోటీలకు ఎంపికైన శ్రీవర్ష

కరీంనగర్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిని ఎన్.శ్రీవర్ష సెపక్ తక్రా జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని కరుణ తెలిపారు. ఈ నెల10వ తేదీ నుంచి 12వ వరకు గోలేటి టౌన్ షిప్, ఆసిఫాబాద్ జిల్లాలో జూనియర్స్ రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా చాంపియన్ షిప్‌లో సత్తాచాటినట్లు పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 1 వరకు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు.



రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

శివారు కాలనీలు సమస్యలకు నిలయాలు


వరలక్ష్మీకాలనీలో సీసీ రోడ్డు లేక అధ్వానంగా మారిన రహదారి

● డ్రైనేజీ, సీసీ రోడ్లు లేక ప్రజల ఇబ్బందులు
● దోమలతో విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు
● వేములవాడ మున్సిపల్ తీరుపై అసహనం

వేములవాడ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని శివారు కాలనీలపై మున్సిపల్ అధికారులకు పట్టింపులేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ పట్టణంలోని కోనాయపల్లి రోడ్డు, మల్లారం రోడ్డు ప్రాంతాల్లో 15ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకున్నా అభివృద్ధి పనులు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి కనీసం డ్రైనేజీలు, సీసీ రోడ్డు కూడా నిర్మించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా అభివృద్ధి జరుగుతుందని ఆశించామంటున్నారు. వర్షాకాలంలో చిన్నపాటి వర్షం పడినా రోడ్లు చిద్రమైపోయి నడవలేని స్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ పట్టణంలోని 28 వార్డులకు కౌన్సిలర్‌లు ఉన్న సమయంలో సమస్యలు ప్రజాప్రతినిధుల దృష్టికితీసుకువెళ్లామని ప్రస్తుతం తమ సమస్యను చెప్పుకోవడానికి కూడా ఎవరూ లేరని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు తమ కాలనీకి వార్డు ఆఫీసర్ ఎవరూ రాలేదని, ఇప్పట్కైనా తమ సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కాలనీ మహిళలు కోరుతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి జాడలేదు

వేములవాడ పట్టణం నుంచి కోనాయపల్లి రోడ్డుకు వెళ్లే మార్గంలోని వరలక్ష్మి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 యేళ్ల క్రితం ఇంటి నిర్మాణాలు జరిగినా తమ కాలనీలో ఇప్పటికీ అభివృద్ధి జరగలేదని చెబుతున్నారు. ఇంటి పన్ను కోసం మున్సిపల్ అధికారులు వచ్చి వసూలు చేసుకుని వెళతారని, సీసీ రోడ్డు, డ్రైనేజీ గురించి అడుగుతే తమ పరిధి కాదని చెబుతున్నారని కాలనీకి చెందిన మహిళలు వాపోతున్నారు. మల్లారం రోడ్డు నుంచి భీమేశ్వర గార్డెన్ వెళ్లే ద్వారకనగర్ చర్చి వెనుక రోడ్డు అధ్వానంగా మారిందని, వర్షాలకు రోడ్డు కోతకు గురికావడంతో కనీసం అధికారులు కన్నెత్తి కూడా చూడ లేదని విమర్శలున్నాయి. మల్లారం రోడ్డులోని కట్టుకాలువ పక్కన గల కాలనీలో సైతం సీసీ రోడ్డు, డ్రైనేజీ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


డ్రైనేజీ లేక రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ఇంటికి వెళ్లాలంటే నరకయాతనే

రంజిత్‌కుమార్, వరలక్ష్మికాలనీ, వేములవాడ



మేము ఇళ్లు నిర్మాణం చేసుకుని సుమారు ఐయేళ్లు అవుతోంది. ఇప్పటి వరకు కాలనీలో ఎలాంటి అభివృద్ధి పనులు లేవు. వర్షకాలం వస్తే రోడ్డు నుంచి ఇంటికి వెళ్లాలంటే నరకయాతన పడుతున్నాం. నడుచుకుంటూ వెళ్లేందుకు కూడా వీలులేకుండా బురదమయంగా మారుతోంది. అప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

వేములవాడ మున్సిపల్ పరిధిలోని శివారు కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాం. శివారు కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మాణం చేపడుతాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే అభివృద్ధి పనులు చేపడుతాం. వార్డుకు 10 లక్షల సీసీ రోడ్డు, డ్రైనేజీకి నివేదిక పంపించాం.

అనారోగ్యం బారిన పడుతున్నాం

సాయి, వరలక్ష్మికాలనీ , వేములవాడ



ఎన్నో ఏళ్లుగా కాలనీలో నివాసం ఉంటున్నాం. కాలనీలో కొనాయపల్లి వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి వరలక్ష్మికాలనీకి వచ్చే రోడ్డుకు వందల ఇళ్లు ఉన్నాయి. అయినప్పటికీ సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించకపోవడం ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

అతివలకు ఉపాధి.. నేతన్నకు నిరాశ

(5వ పేజీ తరువాయి)

ఎదురుచూపులే మిగిలిస్తున్నాయి. గత ప్రభుత్వం మరమగ్గాల కార్మికులను యజమానులుగా మార్చే దిశగా వర్కర్ టు ఓనర్ పథకాన్ని రూపకల్పన చేశారు. ఇందుకు అనుగుణంగానే రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు వద్ద వీవింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. 42 వీవింగ్ షెడ్లు నిర్మాణం జరిగింది. కార్మికులకు నచ్చే విధంగా సెమీ ఆటో మరమగ్గాలను నమూనాగా ఏర్పాటు చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రం మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద 88 ఎకరాల్లో రూ 374 కోట్లతో వీవింగ్ పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొదటి విడతలో 1,104 మంది కార్మికులకు వర్క్‌షెడ్లను నిర్మించి అందించాలనే లక్ష్యంగా పనులు ప్రారంభించారు. రోడ్లు, నీటి వసతి, కరెంట్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. 46 వర్క్‌షెడ్లను నిర్మించాలనే లక్ష్యంగా పెట్టుకొని 42 షెడ్లు పూర్తి చేశారు. ఇందులో కార్మికులకు మొదటి విడతలో 4,416 మరమగ్గాలను గ్రూప్ షెడ్ల కింద అందించనున్నారు. ఒక్కో కార్మికుడికి 800 చదరపు అడుగుల్లో స్టోర్‌రూంతో కలిపి అందిస్తారు. ఇందులో నాలుగు సెమీ ఆటోమేటిక్ మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రం ఇస్తారు. పార్కులో 60 వార్పిన్ మిషన్లు ఏర్పాటు చేస్తారు. ఒక్కో యూనిట్ ధర రూ.8 లక్షలుగా ముందుగా నిర్ణయించారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ 16.52 లక్షల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఇందులో 10 శాతం లబ్ధిదారుడి వాటాధనం 50 శాతం ప్రభుత్వ రాయితీ, 40 శాతం బ్యాంక్ రుణం ఉండే విధంగా పథకానికి రూపకల్పన చేశారు. సిరిసిల్లలో ఏర్పాటు చేస్తున్న వీవింగ్ పార్కులో కొందరికే మరమగ్గాల యూనిట్లు దక్కే అవకాశం ఉండడంతో మిగతా కార్మికులు నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగంలో జియో ట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 30352 ఉన్నాయి. వీటిపై 6500 మంది పనిచేస్తున్నారు. అనుబంధ పరిశ్రమల్లో మరో 6 వేల మంది వరకు పనిచేస్తున్న వారు ఉన్నారు. ప్రభుత్వం మొదటి దశలో కేవలం 1104 మందికే యూనిట్లను అందించడంతో మిగతా కార్మికులు నిరీక్షిస్తున్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు



హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

గంభీరావుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో సోమవారం గంభీరావుపేట మండల బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. నాఫ్స్‌కాప్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుతో వెళ్లి కేటీఆర్‌ను కలిసారు, స్థానిక సంస్థల ఎన్నికల అంశంతో పాటు బీఆర్‌ఎస్ మండల యూత్ విభాగం సీనియర్ నాయకులు కరువారి శంకర్ కూతురు వివాహ పత్రికను ఈ సందర్భంగా కేటీఆర్‌కు అందజేసి ఆహ్వానించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో నాఫ్స్‌కాప్ చైర్మెన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, మండల గౌడ సంఘం అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు చేరాల వెంకటస్వామి, నాయకులు కరువారి శంకర్ ఉన్నారు.

24న గ్రామ పంచాయతీ కార్మికుల మహాసభ

కోనరావుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24, 25 తేదీల్లో జరుగనున్న గ్రామ పంచాయతీ కార్మికుల మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలో మహాసభ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. మహాసభలో పంచాయతీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు ఎల్లారెడ్డి, అరుణ్‌కుమార్ కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సభలకు సంబంధించిన గోడ ప్రతులను స్థానిక నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, నరేందర్, శోభన్, రాజయ్య, శ్రీనివాస్, నర్సయ్య, రాజవ్వ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి ముందుకు రావాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రజలు ఐక్యతతో ముందుకు రావాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం ఆలయం ఆవరణలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. నాయకులు బాలకిషన్, బాల్‌రెడ్డి, నరేశ్, సంజీవరెడ్డి, నర్సయ్య, శ్రీకాంత్, రమేశ్, వేణు, రాజు, ఈశ్వర్, నవీన్, దాసు, తిరుపతి, సత్తయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బోయినపల్లి అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) మండలంలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు సోమవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారిని మరింత ప్రోత్సహించేందుకు చంద్ర ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓతో ఉత్తమ ఉపాధ్యాయులను చంద్ర ఎడ్యుకేషన్ ట్రస్టు ఎంపిక చేసింది. సందర్భంగా 20 మంది ఉత్తమ ఉపాధ్యాయులను మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చంద్ర ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ చెన్న మాధవుని రామరాజు, మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు తిరుపతి నాయక్, ఉషారాణి, శ్రీనివాస్, పరుశురాములు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చందుర్తి,అక్టోబరు 13: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ సౌందర్య అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో మండల స్థాయి పోషణ మాసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్‌వాడీలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

మాల మహానాడు మండల కమిటీ ఎన్నిక

చందుర్తి,అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల మాల మహానాడు నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు నీరటి శ్రీనివాస్ తెలిపారు. మండల మాల మహానాడు అధ్యక్షుడిగా అసినిపర్తి యేసు కుమార్,ఉపాధ్యక్షుడిగా నీరటి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గందం ప్రదీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బండి శ్రావణ్ కుమార్, కోశాధికారిగా గొర్రె నందులను ఏకగ్రీవంగా శ్రీనివాస్ తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు అవునూరి ప్రభాకర్‌మాదిగ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌కు సోమవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన చేపట్టారు. కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, బిక్షపతి, పుట్టరవి తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట: మండలంలోని నాగంపేటలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల ఆధ్వర్యంలో సోమవారం నల్లబాడ్జీలతో నిరసన చేపట్టారు. న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ బాధ్యుడిపై కేసు నమోదు చేసి, న్యాయపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎంఆర్‌పీఊస్ నాయకులు గణేష్, బాలరాజు, సత్యం, రవి, రాజం, బాలెల్లం తదితరులు ఉన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించాలి



ప్రజావాణిలో ప్రజల సమస్యలను వింటున్న జిల్లా కలెక్టర్



కలెక్టరేట్‌కు తరలివచ్చిన విలీన గ్రామాల నాయకులు

● కలెక్టర్ ఎం. హరిత

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎం. హరిత అదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన ప్రజలనుంచి జిల్లా కలెక్టర్ ఎం. హరిత, జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌లు దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం అయా సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులను అదేశించారు. ప్రజావాణిలో 81 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూశాఖకు 48, పంచాయితీరాజ్ శాఖకు 11, ఎస్పీ కార్యాలయానికి 5, ఉపాధికల్పన శాఖకు 4, సిరిసిల్ల మున్సిపాల్టీకి 3, విద్యాశాఖకు 3, పౌరసరఫరాల శాఖ1, మత్స్యశాఖకు 1, వైద్యాఆరోగ్యశాఖకు 1, రవాణా శాఖకు 1, సంక్షేమాశాఖకు 1, వేములవాడ మున్సిపాల్టీకి1, జిల్లా పరిషత్‌కు 1 చొప్పన దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపాపడంతోపాటు అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, హౌజింగ్ ఈఈ శంకర్, జిల్లా పంచాయితీ అధికారి షర్ఫుద్దీన్‌లతోపాటు జిల్లా అధికారులుపాల్గొన్నారు.

దాన్యం అరబెట్టుకునేందుకు అవకాశం ఇవ్వాలి

సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనం చేసిన ఏడు గ్రామాలకు చెందిన రైతులు పండించిన ధాన్యంను అరబెట్టుకునేందుకు స్థలంలేక ఇబ్బందులు పడుతున్నారని గతంలో మాదిరిగానే రెండవ బైపాస్‌రోడ్డులో ఒక పక్కన ధాన్యం ఆరబెట్టుకునేందుకు అనుమతులు ఇవ్వాలంటూ పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్ యాదవ్, తాజా మాజీ కౌన్సిలర్‌లు లింగంపల్లి సత్యనారాయణ, బోల్గం నాగరాజు, మాజీ ఎంపీటీసీ బుర్ర మల్లిఖార్జున్, నాయకులు పోచవేణి ఎల్లయ్య యదవ్, కల్లూరి మధు, రగుడు గ్రామాభివృద్ధికమిటి అధ్యక్షుడు బూర యాదగిరిలు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా కలెక్టర్ ఎం. హరితతోపాటు జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ఎస్పీలను కలిసి వినతి పత్రాలను అందించారు. ఏడు గ్రామాలైన రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్ధాపూర్ గ్రామాలకు చెందిన రైతులు పండించిన ధాన్యంను విక్రయించుకునేందుకు స్థలాలు లేకపోవడంతో గత కొన్నేళ్లుగా రైతులు రెండవ బైపాస్ రోడ్డులోనే ధాన్యం అరబెట్టుకుని విక్రయించుకుంటున్నారని ఈ సారి కూడా అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రగుడు గ్రామానికి చెందిన రైతులు బూరనర్సయ్య, గుగ్గిళ్ల సతీష్, దొంతుల రాజమల్లు, పోచవేని బాలయ్య, కాసర్ల కిషన్ పాల్గొన్నారు.

నా భూమి తీసుకుని మోసం చేశారు

- నేభూరి భాగ్యవ్వ, మండెపల్లి, తంగళ్లపల్లి



తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామానికి చెందిన నాకు ఉన్న భూమిని ఇద్దరు మరదళ్లు, వారి కుమారులు నిన్ను పోషిస్తామని నమ్మించి నాపేరున ఉన్న అస్తితో పాటు భూమి వారిపేరు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అప్పటి నుంచి నన్ను పోషించడం లేదని జిల్లా కలెక్టర్ స్పందించి నా అస్తి, తిరిగి నాపేరు చేయించి ఆదుకోవాలి.

నా భూమిని తిరిగి ఇప్పించాలి

- మాట్ల శంకర్, జిల్లెల్ల, తంగళ్లపల్లి



తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులో నిర్మించిన వ్యవసాయ కళాశాల కోసం తన మూడు ఎకరాల 20 గుంటల భూమి తీసుకున్నారని ఆ భూమికి బదులు మరోచోట భూమి ఇస్తామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదు.

274 మద్యం దరఖాస్తులు

సిరిసిల్లక్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైన్స్ టెండర్‌లకు ఇప్పటి వరకు 274 దరఖాస్తులు దాఖలయ్యాయి. జిల్లా కలెక్టరేట్ సముదాయంలో ఏర్పాటు చేసిన 3 కౌంటర్లలో సోమవారం 89 దరఖాస్తులు దాఖలయ్యాయి. అంతకుముందు వచ్చిన175 దరఖాస్తులతో కలిపి మొత్తం 274 దరఖాస్తులు సమర్పించారు. జిల్లాలోని 48 వైన్స్‌లకు కేవలం 40 వైన్స్ లకే టెండర్ దరఖాస్తులు వేశారు. మిగతా 8 వైన్స్‌లకు ఒక్క దరఖాస్తు దాఖలు చేయలేదు. ఇంకా 5రోజులు మాత్రమే గడువు ఉన్నప్పటికీ దరఖాస్తులు చివరన అధికంగా వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

సంక్షేమమే లక్ష్యం

● ఎస్పీ మహేష్ బి. గితే

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యమని ఎస్పీ మహేష్ బి. గీతే అన్నారు. జిల్లాలో హోం గార్డ్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన సుధాకర్ కుటుంబ సభ్యులకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హోమ్ గార్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ. 15 వేల ఆర్థిక సహాయం ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖ ఎల్లప్పుడూ తమ సిబ్బందికి, వారి కుటుంబాలకు అండగా ఉంటుందని తెలిపారు. ఆర్.ఐ యాదగిరి పాల్గొన్నారు.

రైతుకు ఆర్థిక సహాయం అందజేత

కోనరావుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన స్వామిదాసు అనే రైతుకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందగా రైతుకు సెస్ అధికారులు నష్టపరిహారం చెక్కు మంజూరు చేశారు. సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి సోమవారం రూ.40వేల చెక్‌ను రైతుకు అందజేశారు.సెస్ ప్రతినిధులు బాపురెడ్డి బృందం శ్రీనివాస్ రెడ్డి, కొమురయ్య, మల్లారెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, జగన్, వెంకటేష్, చంద్రారెడ్డి ఉన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నాగంపేటలో కొనుగోలు కేంద్రం

గంభీరావుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం నాగంపేట, ముస్తాఫానగర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మెన్ కొమిరిశెట్టి విజయ తిరుపతి సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వ ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. రైతు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వ కొనుగోలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో రాజిరెడ్డి, డైరెక్టర్లు, నాయకులు, రైతులు ఉన్నారు.

● తంగళ్లపల్లి : వరిధాన్యంను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని నేరెళ్ల ప్యాక్స్ చైర్మన్ కొడూరి భాస్కర్‌గౌడ్ సూచించారు. మంగళవారం తంగళ్లపల్లి మండలంలో జిల్లెల్ల, నేరెళ్ల, చిన్నలింగపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్లు అబ్బాడి అనిల్‌రెడ్డి, రాజిరెడ్డి, గణేశ్ గౌడ్, తాండ్ర రవీందర్‌రావ్, నారాయణ గౌడ్, పొన్నాల కిషన్, మార్కెట్ కమిటి డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లింగారెడ్డి, రవి, శ్రీనివాస్, శోభా, పాక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

● రుద్రంగి : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. రుద్రంగి మండలంలోని మానాల గ్రామంతో పాటు గిరిజన తండాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూం జలపతి, పిసరి చిన్న భూమయ్య జక్కు మోహన్, గోపిడి రవీందర్, ఇప్ప మహేష్, జక్కుల లక్ష్మినారాయణ ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : రైతులు పండించిన ధాన్యాన్ని రైతు ముంగిట్లోనే కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం, తహసీల్దార్ సుజాతలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు బండలింగంపల్లి, రాగట్లపల్లి, పదిర, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, అగ్రహారం, పోతిరెడ్డిపల్లి, సింగారం గ్రామాల్లో సెర్ప్(ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సోమవారం ప్రారంభించారు.

కొనుగోలు కేంద్రం కోసం ఎదురుచూపులు



చందుర్తిలో రోడ్డుపై ధాన్యం కుప్పలు

చందుర్తి, అక్టోబరు 13 (ఆంధ్ర జ్యోతి) : చందుర్తి మండల కేంద్రంతో పాటు తిమ్మాపూర్, రామన్నపేట, ఆశిరెడ్డిపల్లి, మల్యాల పాటు వివిధ గ్రామాల్లో గత సీజన్‌లో చందుర్తి ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. ధాన్యం కొనుగోళ్లు జరగక పోవడంతో ఉదయం నుంచి రాత్రి వరకు రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. వరి కోతలు ప్రారంభించి 15 రోజులు ఆవుతుతోందని చందుర్తికి చెందిన మర్రి రాజు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రంను ప్రారంభించాలని కోరాడు.

రెండు రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తాం

పవన్ కుమార్ ఏపీఎం, చందుర్తి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తాం. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం, రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, కొనుగోళ్ల వేగవంతం చేసి పూర్తి చేస్తాం.

భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

కోనరావుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న పనుల విషయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ అన్నారు. కోనరావుపేట బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం మాట్లాడారు. రాజన్న ఆలయాన్ని భక్తుల దర్శనం బంద్ చేసే ముందుగా ప్రజల్లోకి దర్శనం ఆపివేస్తున్నామని తెలియజేయాలని కోరారు. అలా కాకుంటే చాలా రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడతారని అన్నారు. కొన్ని రోజుల ముందుగానే విషయాన్ని భక్తులకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు గొట్టె రామచంద్రం, జింక వెంకటి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయ అభివృద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదని, భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే చూస్తూ ఊరుకోదని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు లక్‌పతి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాజన్న క్షేత్రంలో బాలాలయం ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని అన్నారు. దేశంలో ప్రముఖ దేవాలయాలు అభివృద్ధి జరిగాయని అక్కడ లేని దర్శనాల నిలిపివేత వేములవాడలో ఎందుకని ప్రశ్నించారు. దేశ నలుమూలల నుంచి రాజన్న దర్శనానికి వచ్చి భక్తిశ్రద్ధలతో కోడె మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు. రాజన్న ఆలయంలో కాకుండా భీమన్న దేవాలయంలో కోడె మొక్కులు ఎలా తీర్చుకుంటారని అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దర్శనాలను కొనసాగిస్తూ ఆలయ అభివృద్ధిని చేపట్టాలని లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని లక్‌పతి హెచ్చరించారు. నాయకులు మహేశ్, నాగరాజు, లింబాద్రి, ప్రకాశ్, గోవర్ధన్, వెంకట్, శ్రీను పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి

బోయినపల్లి అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి నిరుపేద రోగులకు ఆర్థికంగా తోడ్పడుతుందని బోయినపల్లి సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్ అన్నారు. బోయినపల్లి మండలంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషితో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. జగ్గారావుపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్ పాల్గొని పంపిణీ చేశారు. అంతేకాకుండా వివిధ గ్రామాల్లో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరేపు నరేష్, గోట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

చందుర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆధార్ క్యాంపును మండలంలోని అన్ని గ్రామాల విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వినయ్ కుమార్ తెలిపారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నుంచి ఈ క్యాంపులో అన్ని ఆధార్ అందిస్తారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకునేందుకు, ఆధార్ కార్డు లేని విద్యార్థులకు కొత్త ఆధార్ కార్డు తీసుకునేందుకు ఇదొక మంచి అవకాశమన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చందుర్తి అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి)ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి అన్నారు. చందుర్తి మండలంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు 38 లబ్ధిదారులకు 14 లక్షల 10 వేయ్యిల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవిందర్ రెడ్డి, ఎసుదాసు, తదితరులు పాల్గొన్నారు

రాజన్న ఆలయ అభివృద్ధిని అడ్డుకోవద్దు



రాష్ట్ర ప్రభుత్వ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిపేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి జరుగుతుంటే అడ్డుకుని చరిత్రలో మిగిలిపోకండని పట్టణ కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడంతో సోమవారం పట్టణ కాంగ్రెస్ నేతలు, అర్బన్ మండల కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు ఆగయ్య, కనుకయ్య, రాజు, భూమయ్య తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఆగమశాస్త్రం ప్రకారం వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం పనులను ప్రభుత్వం చేపడుతోందని, కొన్ని పార్టీల నాయకులు రాజన్న ఆలయంతో రాజకీయం చేయడం సరికాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులతో కలిసి సోమవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, గౌస్, బాబు, బుచ్చాగౌడ్, లక్ష్మీ, శ్రీనివాస్, తిరుపతి, మల్లారెడ్డి, గోపాల్, రవి, బాల్‌రెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొమిరిశెట్టి విజయ తిరుపతి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్ర పటానికి సోమవారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, జిల్లా ప్రదాన కార్యదర్శి మూల రామచంద్రారెడ్డి, నాయకులు పిట్ల వెంకటి, మల్యాల రాజవీర్ ఉన్నారు.

ముస్తాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధిని బీజేపీ నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణినర్సింలు, గజ్జెల రాజు,గుండెల్లి శ్రీనివాస్,కొండల్‌రెడ్డి, బొప్ప నర్సయ్య, శీల ప్రశాంత్, కొప్పు రమేశ్, అంజనేయులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: బీజేపీ చర్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి కాంగ్రెస్ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్లం ప్రవీణ్, నాయకులు నేరెళ్ల నర్సింగం, పెద్దూరు తిరుపతి, మచ్చ శ్రీనివాస్, లింగాల భూపతి, లింగం రాణి, చుక్క శేఖర్, సుద్దాల శ్రీనివాస్, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్, కట్కం రాజు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, తర్రె లింగం తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి క్షీరాభిషేకం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగం కుమార్, బొజ్జ మల్లేశం, ధర్మపురి శ్రీనివాస్, పొద్దుపొడుపు లింగారెడ్డి, బాణాల రవీందర్ రెడ్డి, సంటి ఏసుదాసు, న్యాత నవీన్ పాల్గొన్నారు.



చందుర్తిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



రుద్రంగిలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



ముస్తాబాద్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు